## క్లుప్తంగా

### ఎలక్ట్రానిక్ ఓటింగ్‌పై అవగాహన




అవగాహన కల్పిస్తున్న అధికారులు

పాలకుర్తి: మండల పరిధిలోని పుట్నూర్, గుడిపల్లి గ్రామాల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ విధానంపై శుక్రవారం అధికారులు అవగాహన కల్పించారు. ప్రత్యేక మొబైల్ వ్యాన్ ద్వారా వీవీప్యాడ్, ఈవీఎం మిషన్ల గురించి వివరించారు. ఓటింగ్ ఏవిధంగా వేయాలి అనే విషయమై స్థానికులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్నికల ప్రచార రథం ఇన్‌చార్జి శశిధర్‌తో పాటు ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### పర్యావరణాన్ని పరిరక్షించాలి



మొక్క నాటుతున్న క్లబ్ ప్రతినిధులు

సుల్తానాబాద్: పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నోముల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ సుల్తానాబాద్ ఆధ్వర్యంలో ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం పట్టణంలోని గణేశ్‌నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మొక్కలు నాటారు. కాలనీవాసులకు ఉసిరి, నేరేడు, జామ, వేప మొక్కలతో పాటు పూల మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు నోముల శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కో–ఆర్డినేటర్లు మాటేటి శ్రీనివాస్, జూలూరి అశోక్, కోశాధికారి రాయేల్ల నవీన్, తమ్మనవేణి సతీశ్ పాల్గొన్నారు.

### బాధ్యతలు స్వీకరణ



రామగుండం: రామగుండం పట్టణ నూతన ఎస్సైగా బోయ వెంకటస్వామి శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు విధులు నిర్వర్తించిన బత్తుల శరణ్య గోదావరిఖని వన్‌టౌన్‌కు బదిలీపై వెళ్లారు.

### నిరుపేద కుటుంబాలకు టార్పాలిన్లు అందజేత

జూలపల్లి: మండలంలోని వడ్కాపూర్‌లో వర్షాలకు ఇళ్లు దెబ్బతిన్న 5 నిరుపేద కుటుంబాలకు, జెడ్పీటీసీ, కేసీఆర్ సేవాదళం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొద్దుల లక్ష్మణ్ పంపించిన టార్పాలిన్లను సేవాదళం మండల యూత్ అధ్యక్షుడు జెట్టి సతీశ్ శుక్రవారం అందజేశారు. సభ్యులు వేల్పుల గట్టయ్య, బొల్లపెల్లి అంతయ్య, జెట్టి రాజయ్య, అభిలాష్ ఉన్నారు.

### ప్రమాదాల నియంత్రణపై అవగాహన

పెద్దపల్లిరూరల్: వానాకాలంలో విద్యుత్ షాక్ సర్క్యూట్ కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశముందని, వాటిపై కనీస అవగాహన కలిగి ఉంటే నియంత్రించవచ్చని పెద్దపల్లి అగ్నిమాపకశాఖ అధికారి దేవనంది శ్రీనివాస్ తెలిపారు. రంగంపల్లిలోని పెట్రోల్‌పంపులో శుక్రవారం అవగాహన కల్పించారు.

### మణిపూర్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలి




నిరసన తెలుపుతున్న పీఓడబ్ల్యూ సభ్యులు

కమాన్‌పూర్: మణిపూర్‌లో జరుగుతున్న మారణకాండకు కేంద్రం, ఆ రాష్ట్ర ప్రభుత్వాలే ప్రధాన కారణమని మణిపూర్ ప్రభుత్వాన్ని వెంటనే బర్తరఫ్ చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకన్న డిమాండ్ చేశారు. సెంటినరీకాలనీలో శుక్రవారం ప్రగతిశీల మహిళా సంఘం, ఐఎఫ్‌టీయూల ఆధ్వర్యంలో నల్ల జెండాలతో నిరసన తెలిపారు. వెంకన్న మాట్లాడుతూ మానవ సమాజం తలదించుకునేలా మణిపూర్‌లో మహిళలపై అత్యాచారాలు, హత్యలకు బీజేపీ అనుసరిస్తున్న మత విద్వేషాలే కారణమని ఆరోపించారు. దీనిపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని, బాధిత కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో అశోక్, రజిత, సావిత్రి, రాజమ్మ, పద్మ, లక్ష్మి, రాధ, వసంత, శారద, భాగ్య, రాజు, శేఖర్ పాల్గొన్నారు.

# ఏటా ఇదే పరిస్థితి

- వర్షాలకు మునుగుతున్న లో లెవల్ వంతెనలు
- పెద్దపల్లి జిల్లా, ఉమ్మడి జిల్లాకు రాకపోకలు బంద్
- నూతన వంతెనలు నిర్మించాలని కోరుతున్న మండల ప్రజలు



జూలపల్లి వద్ద హుస్సేన్‌మియా వాగుపై లో లెవల్ వంతెన

జూలపల్లి: భారీ వర్షం పడుతుందంటే ప్రయాణం వాయిదా చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రతి ఏటా వర్షాకాలంలో ఇదే తంతు కొనసాగుతున్నప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో మండల ప్రజల తిప్పలు తప్పడం లేదు. మండల కేంద్రాన్ని ఆనుకొని ఉన్న హుస్సేన్‌మియా వాగుపై, మండలంలో జూలపల్లి వద్ద లోలెవల్ వంతెన, వడ్కాపూర్ నుంచి ఎలిగేడు మండలాన్ని కలుపుతూ ఉన్న వడ్కాపూర్–ధూళికట్ట మధ్య ఉన్న లోలెవల్ వంతెన, చీమలపేట, తేలుకుంట మధ్యనున్న లోలెవల్ వంతెనలు వర్షాలకు మునిగి మండల ప్రజల రాకపోకలకు అవస్థలు పడాల్సి వస్తోంది.

**ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం శూన్యం**

దాదాపు 30ఏళ్ల క్రితం లోలెవల్ వంతెనలు అప్పటి పరిస్థితులకు అనుగుణంగా నిర్మించగా ప్రస్తుతం దంచి కొడుతున్న వానలకు అవి మునిగడంతో వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, సొంత పనులకు ఉమ్మడి జిల్లా కేంద్రానికి వెళ్లే ప్రజలకు అడ్డంకిగా మారి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 15రోజుల క్రితం తేలుకుంట సర్పంచ్‌తో సహా గ్రామస్తులు తమ గ్రామ సమీపంలో ఉన్న రామప్ప చెరువు కింద రోడ్డుపై నిర్మించిన లోలెవల్ వంతెన కొత్తగా నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. తాజాగా నాలుగు రోజుల క్రితం మంత్రి కేటీఆర్ పుట్టినరోజు వేడుకలు జరిపేందుకు వడ్కాపూర్ వెళ్లిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్‌ను కాంగ్రెస్ నాయకులు అడ్డుకున్నారు. తమ గ్రామ సమీపంలో ఉన్న హుస్సేన్‌మియా వాగుపై వంతెన నిర్మించేందుకు మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించాలని వాగ్వాదానికి దిగారు. ప్రతి ఏటా వంతెనలు నిర్మించాలని వినతి పత్రాలు అందజేయడం పరిపాటిగా మారిందని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నిధులు మంజూరు చేయించి ఇబ్బందులు తొలగించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

### నూతన వంతెన నిర్మించాలి



ప్రతి సంవత్సరం వర్షాకాలంలో వాగుపై ఉన్న లో లెవల్ వంతెన మునిగి మండల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నూతన వంతెన నిర్మించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి. ప్రజల ఇబ్బందులు తొలగించాలి.

– మల్లెత్తుల మల్లేశం, జూలపల్లి

### ఎక్కడికీ వెళ్లలేని పరిస్థితి



వర్షం పడితే చాలు గ్రామస్తులు బయటకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతోంది. రామప్ప చెరువు కింద లోలెవల్ వంతెన చిన్న వర్షానికే మునిగి రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ప్రతి పనికి ఈ లోలెవల్ వంతెనపై నుంచి వెళ్లాల్సిందే. ఐదురోజులుగా ఎడతెరిపిలేకుండా పడుతున్న వర్షానికి లోలెవల్ వంతెన మునగడంతో మండలంలోని ఐదు గ్రామాల ప్రజలు, గ్రామస్తులు ఎక్కడికీ వెళ్లలేని పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి వంతెన నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలి.

– మంద లక్ష్మణ్, తేలుకుంట

## వర్షానికి దెబ్బతిన్న ప్రాంతాల పరిశీలన



రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు



పరిశీలిస్తున్న తహసీల్దార్ వేణుగోపాల్

ఎలిగేడు: భారీ వర్షాలతో మండలంలో దెబ్బతిన్న రోడ్లు, చెరువులు, గ్రామాల్లో ఇళ్లను, నీళ్లు నిలిచిన ప్రాంతాలను అధికారులతో కలిసి ఎంపీపీ తానిపర్తి స్రవంతి శుక్రవారం పరిశీలించారు. మండల కేంద్రంలోని పెట్రోల్ పంపు వద్ద ప్రధానరోడ్డు రాకపోకలకు అంతరాయం, ధూళికట్ట ఊర చెరువు నిండటంతో ధూళికట్ట నుంచి జూలపల్లికి వెళ్లే ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బంది పడ్డారు. మండలంలోని చెరువులు, కుంటలను ఇరిగేషన్ అధికారులతో పరిశీలించారు. వాటర్ ట్యాంకులు, బావుల్లో క్లోరినేషన్ చేయడంతోపాటు, నీరు నిల్వ ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్, దోమలు వ్యాప్తి చెందకుండా ఫాగింగ్ చేయించారు. మెడికల్ ఆఫీసర్‌తో మాట్లాడి క్యాంపులు ఏర్పాటు చేయించారు. మండల ప్రత్యేక అధికారి తిరుపతిరావు, తహసీల్దార్ నాగరాజమ్మ, ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, ఎంపీవో అనిల్‌రెడ్డి, జూలపల్లి ఎస్సై వెంకటకృష్ణ, పీఆర్ఏఈ జగదీష్, మెడికల్ ఆఫీసర్ నిస్సీక్రిస్టీనా పాల్గొన్నారు.

**వరద పరిస్థితులపై క్షేత్ర పరిశీలన**

రామగుండం: ఎల్లంపల్లి ప్రాజెక్టుకు కొనసాగుతున్న వరద ఉధృతిని అంతర్గాం తహసీల్దార్ కత్రోజు వేణుగోపాల్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వరద ఉధృతిపై ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు సమాచారం అందిస్తూ లోతట్టు గ్రామాల ప్రజల భద్రతపై కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌రెడ్డి ఉన్నారు.

## నీట మునిగిన పొలాలను అధికారులు పరిశీలించాలి



పొలాలను పరిశీలిస్తున్న సర్పంచ్ లావణ్య

యైటింక్లయిన్‌కాలనీ: రామగిరి మండలం ముస్త్యాల గ్రామ సమీపంలోని గోదావరి నది పరివాహక ప్రాంతంలోని వరద నీటిలో మునిగిన పొలాలను శుక్రవారం సర్పంచ్ లావణ్య రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు పొలాల్లో వేసుకున్న వరినాట్లు వరద నీటిలో మునిగిపోవడంపై ప్రభుత్వ అధికారులు పరిశీలించి రైతులకు పరిహారం చెల్లించాలని కోరారు. అలాగే గ్రామంలో ఇళ్లు దెబ్బతిన్న కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. రైతులు పొలాల వద్దకు వెళ్లొద్దని సూచించారు. ధర్మారం మాజీ సర్పంచ్ చంద్రయ్య, రైతులు ఉన్నారు.

## అంటువ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

జూలపల్లి: వర్షాలకు అంటువ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలను తీసుకోవాలని ఎంపీపీ రమాదేవి సూచించారు. మండలంలోని వడ్కాపూర్, జూలపల్లి, వెంకట్రావుపల్లె గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక వైద్య శిబిరాలను శుక్రవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. మండల ప్రత్యేకాధికారి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి రంగారెడ్డి, ఎంపీడీవో వేణుగోపాలరావు, ఎంపీవో కిరణ్, మండల వైద్యాధికారి సంపత్‌రెడ్డి, వైస్ చైర్మన్ మొగురం రమేశ్, సర్పంచులు తిరుపతి, రాధ, నర్సింహయాదవ్, సూపర్‌వైజర్ వసంత తదితరులు పాల్గొన్నారు.

**వరద ప్రభావిత ప్రాంతాల్లో వైద్యశిబిరం**

సుల్తానాబాద్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డాక్టర్లు శ్రీజ, ఉదయ్ అన్నారు. గర్రెపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వరద ప్రాంతాల కాలనీల్లో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. హెచ్‌వీ వెంకట్‌రెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

**వైద్య శిబిరం సద్వినియోగం చేసుకోవాలి**

సుల్తానాబాద్‌రూరల్: ఉచితంగా నిర్వహించే వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ బాలాజీరావు అన్నారు. సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో దేవునిపల్లి, కదంబాపూర్ గ్రామాల్లో శుక్రవారం ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పరీక్షలు నిర్వహించి మందులు ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కోమలత, సురేఖ, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

## విధుల్లో నిరంతరం అప్రమత్తంగా ఉండాలి



పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న ఏసీపీ

యైటింక్లయిన్‌కాలనీ: ప్రజల నుంచి వచ్చే డయల్ 100 కాల్స్‌కు పోలీసులు త్వరగా స్పందించాలని, పోలీసులు విధుల్లో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని గోదావరిఖని ఏసీపీ తుల శ్రీనివాస్‌రావు ఆదేశించారు. గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఆయన సందర్శించి స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరు, ప్రజలకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌కు వచ్చే వారితో మర్యాదగా నడుచుకోవాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా గ్రామాల్లో గస్తీ పెంచాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో టూటౌన్ సీఐ వేణుగోపాల్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పొలంలో నిలిచిన మురుగునీటిని తొలగించండి



పొలాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి

ధర్మారం: ఇటీవల కురిసిన వర్షాలకు పంట చేనులో నిలిచిన మురుగునీటిని రైతులు తొలగించాలని మండల వ్యవసాయ అధికారి పూర్ణిమ అన్నారు. ధర్మారం మండలం కానంపెల్లిలోని వరిపొలాలను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ వర్షం వరదతో పంటపొలాల్లో నిలిచిన నీటిని తొలగించేందుకు కాలువలు తీయాలని, రానున్న ఐదురోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం న్నందున పంటపొలాల్లో ఎటువంటి మందులు పిచికారీ చేయొద్దని సూచించారు. ఏఈవో ప్రశాంత్, రైతులు ఉన్నారు.

## ఉర్సు ఉత్సవాలకు విరాళం



విరాళం అందజేస్తున్న వెంకటేశ్ పటేల్

సుల్తానాబాద్: పట్టణంలో ఉర్సు ఉత్సవానికి బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష అందించిన రూ.10వేలను బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు తోట వెంకటేశ్ పటేల్ నిర్వాహకులకు అందజేశారు. దర్గా కమిటీ ఆధ్వర్యంలో 30న నిర్వహించనున్న ఉర్సు ఉత్సవాలకు ముఖ్య అతిథిగా దాసరి ఉషను ఆహ్వానించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో మండల కోశాధికారి అల్లెపు చంద్రశేఖర్, దర్గా కమిటీ సభ్యులు మహమ్మద్ అజ్జు, మోసిన్, మతిన్, అక్బర్, షారుఖ్, నబి, ఎండీ సాదిక్ పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

**✦ఎస్సీ, ఎస్టీలకు రక్షణ కరువు**

పాలకుర్తి: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి దేశంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలపై దాడులు ఎక్కువయ్యాయని, కనీస రక్షణ లేకుండా పోయిందని ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కొంద్ర శంకర్‌మాదిగ శుక్రవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. మణిపూర్‌లో మహిళల్ని నగ్నంగా ఊరేగింపుగా తీసుకెళ్లి అత్యాచారం చేసి చంపిన ఘటనను ఆయన ఖండించారు. ఇలాంటి సంఘటనలపై కేంద్ర ప్రభుత్వం మౌనం వీడి నిందితులను చట్టప్రకారం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

**✦31న పౌరహక్కుల దినోత్సవం**

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని పెగడపల్లిలో 31న పౌరహక్కుల దినోత్సవం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు.

**✦ప్లాస్టిక్ పరదాల పంపిణీ**

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంతోపాటు పెగడపల్లి, మీర్జంపేట, రాతుపల్లి గ్రామాల్లో వర్షాలకు ఇల్లు, గుడిసెలు దెబ్బతిన్న వారికి నల్ల ఫౌండేషన్ నేతృత్వంలో శుక్రవారం ప్లాస్టిక్ పరదాలు పంపిణీ చేశారు. కోతుల బెడదతో, వర్షాలకు ఇళ్లు, గుడిసెలకు రంధ్రాలు పడి ఉరుస్తున్నందున వారి ఇబ్బందులను తెలుసుకుని నల్ల ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ నల్ల మనోహర్‌రెడ్డి అందించిన పరదాలను ఫౌండేషన్ సభ్యులు సువర్ణ, బిట్టు, సంపత్‌రెడ్డి, కుమార్ పంపిణీ చేశారు.

**✦గీత కార్మికుడికి సాయం**

సుల్తానాబాద్: సుల్తానాబాద్ మండలం నారాయణరావుపల్లికి చెందిన ఇల్లందుల సంపత్ గౌడ్‌కు సర్వాయి పాపన్న మోకుదెబ్బ గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాగిరి అంజిగౌడ్ రూ.15వేలు అందజేశారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆర్డర్ కాపీ అందజేశారు. కొన్నిరోజుల క్రితం తాటి చెట్టు ఎక్కి కల్లుగీస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడి గాయాలయ్యాయి. స్పందించిన చైర్మన్ పల్లె రవిగౌడ్ ఆర్థికసాయం చేశారని తెలిపారు. కార్యక్రమంలో సుల్తానాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర మౌనిక శ్రీనివాస్ గౌడ్, మొలుగూరి అంజయ్యగౌడ్, జిల్లా అధ్యక్షుడు వేగోళం శంకర్‌గౌడ్, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు పల్లెర్ల శారదగౌడ్, మండల అధ్యక్షుడు బండారి లక్ష్మణ్‌గౌడ్, మండల ఉపాధ్యక్షుడు గడ్డం అనిల్‌గౌడ్, వడ్లకొండ రాములుగౌడ్ ఉన్నారు.

**✦60 ఎకరాల్లో దెబ్బతిన్న వరినాటు**

ఎలిగేడు: భారీ వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో 60 ఎకరాల్లో నాటువేసిన వరి దెబ్బతిన్నట్లు ప్రాథమిక అంచనా వేసినట్లు ఏవో ఉమాపతి శుక్రవారం తెలిపారు.

**✦రాజకీయ యుద్ధభేరి పోస్టర్ ఆవిష్కరణ**

పెద్దపల్లిరూరల్: రాజ్యాధికార సాధనకోసం పద్మశాలీలంతా ఏకం కావాలని పద్మశాలి సంఘం నాయకులు తీర్మానించారు. పెద్దపల్లిలో శుక్రవారం ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో రాజకీయాలకు అతీతంగా ఆగస్టు 13న కోరుట్లలో తలపెట్టిన సదస్సు పోస్టర్‌ను ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరితో పాటు రాష్ట్ర నాయకులు బుద్దె లక్ష్మణ్, శ్రీనివాస్, వేముల రామ్మూర్తి ఆవిష్కరించారు.

**✦మొక్కలు నాటిన శతాబ్ది లయన్స్**

కోల్‌సిటీ: గోదావరిఖని శారదనగర్‌లోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి దగ్గర శతాబ్ది లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతినిధులు శుక్రవారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కంకణాల ముకుందరెడ్డి, ప్రధాన కార్యదర్శి బాలసాని స్వామిగౌడ్, కోశాధికారి దేవినేని శ్రీనివాసరావుతోపాటు కాసర్ల సురేందర్‌రెడ్డి, ఏలేశ్వరం చంద్రమౌళి, ఉట్ల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

**✦పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి**

పెద్దపల్లిరూరల్: పట్టణంలో స్వచ్ఛ శుక్రవారంలో భాగంగా పరిసరాలను శుభ్రంచేశారు. 8వ వార్డు కౌన్సిలర్ బొంకూరి భాగ్యలక్ష్మి పనులను పర్యవేక్షించారు. వానాకాలంలో ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలను తొలగించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామ్మోహన్‌రెడ్డి, జయరాజ్, ఎలమ్మ, సతీశ్ ఉన్నారు.

## కమిషనర్‌కు సన్మానం



కమిషనర్‌ను సన్మానిస్తున్న కార్పొరేటర్లు

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన సుచరన్‌ను శుక్రవారం మున్సిపల్ కార్పొరేటర్స్ ఫోరం నాయకులు, కాంట్రాక్టర్లు వేర్వేరుగా సన్మానించారు. ఫోరం నాయకులు కన్నూరి సతీశ్‌కుమార్, దాతు శ్రీనివాస్, ఎన్వీ రమణరెడ్డి, సాగంటి శంకర్, కాంట్రాక్టర్లు చింతకింద సంపత్, బుద్దె తిరుపతి, విశ్వతేజ, సత్యం, శ్యాం, తిరుపతి, రాజేశ్, దుర్గాప్రసాద్ ఉన్నారు.

## విద్యారంగ సమస్యల పరిష్కారంలో విఫలం

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవీందర్ ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కనీస వసతులను కల్పించడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోకి డీఈఓ అనుమతి ఉంటేనే పాత్రికేయులు, విద్యార్థిసంఘ నాయకులను అనుమతించాలనే ఆదేశాలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం**

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్ల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని స్వీపర్ల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లక్ష్మణ్, రాయలింగు ఆరోపించారు. పెద్దపల్లి బస్టాండ్ వద్ద శుక్రవారం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని అందించి నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి జ్యోతి ఉన్నారు.

**వాహన తనిఖీలు**

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని ప్రధాన కూడళ్లలో శుక్రవారం పోలీసులు వాహన తనిఖీలు చేశారు. కమాన్, కూనారం క్రాస్‌రోడ్, ప్రగతినగర్, బస్టాండ్ ప్రాంతాల్లో జరిపిన తనిఖీల్లో కార్లకు అమర్చిన బ్లాక్ ఫిలిమ్‌లను తొలగించినట్లు ట్రాఫిక్ ఎస్సై దత్తుప్రసాద్ తెలిపారు. నిబంధనలను పాటించని వాహనదారులకు జరిమానా విధించారు.

**తగ్గిన వరద.. ప్రారంభమైన రాకపోకలు**

జూలపల్లి: భారీ వర్షాలకు పొంగిన వాగులు వర్షాలు తగ్గుముఖం పట్టడంతో రాకపోకలు ప్రారంభమయ్యాయి. మండల కేంద్రాన్ని ఆనుకుని ప్రవహించే హుస్సేన్‌మియావాగు పొంగడంతో రెండురోజులు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. శుక్రవారం వరద తగ్గడంతో వాహనాలు నడిచాయి. మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో 15 ఇళ్లు దెబ్బతిన్నాయి. వడ్కాపూర్ దామెరకుంటకు గండి పడింది. ఇక్కడ ప్రవహించే వాగుపై లో లెవల్ వంతెన మునిగి ఉండడంతో వాహనాలు నడవలేదు.

## వీధిదీపాలు ఏర్పాటు చేయాలి

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని పెద్దంపేట రైల్వే గేట్ నుంచి రైల్వేస్టేషన్ వరకు రహదారికి ఇరువైపులా వీధిదీపాలు బిగించాలని కోరుతూ శుక్రవారం రాయదండి ఎంపీటీసీ కొలిపాక శరణ్య మండల ట్రాన్స్‌కో ఏఈ శంకర్‌కు వినతిపత్రం అందించారు. కాగా వీధిదీపాల ఏర్పాటుకు సంబంధించి విద్యుత్ స్తంభాలు, విడిభాగాల అంచనా వ్యయం నివేదిక తయారు చేసి తమకు అప్పగిస్తే ఎమ్మెల్యే నిధులు మంజూరు చేయనున్నారని పేర్కొన్నారు. దీనిపై ఏఈ సానుకూలంగా స్పందిస్తూ త్వరలోనే అంచనా వ్యయం నివేదికలు సిద్ధం చేసి అప్పగిస్తామని హామీ ఇచ్చారన్నారు. గ్రామస్తులు కొలిపాక మధుకర్‌రెడ్డి, సునీత, లక్ష్మి, లావణ్య, అనసూర్య, పుష్పలత ఉన్నారు.

## కొనసాగుతున్న జీపీ కార్మికుల సమ్మె



ఎలిగేడు: దున్నపోతుకు వినతిపత్రం ఇస్తూ..



ధర్మారంలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

కాల్వశ్రీరాంపూర్: మండలపరిషత్ కార్యాలయంలో జీపీ కార్మికులు చేపట్టిన నిరసన దీక్ష శుక్రవారం 23వ రోజుకు చేరింది. కార్యక్రమంలో యూనియన్ మండల అధ్యక్షుడు గట్టయ్య, నాయకులు రాజబాబు, సురేశ్, సంపత్, గౌసొద్దీన్, మధునయ్య, లక్ష్మీకుమార్ పాల్గొన్నారు.

**నిరసన ర్యాలీ**

ధర్మారం: ధర్మారం మండల కేంద్రంలో శుక్రవారం పంచాయతీ కార్మికులు నిరసన ర్యాలీ నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీ కొనసాగింది.

కమాన్‌పూర్: రామగిరి మండలంలో అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలిపారు.

ఓదెల: పంచాయతీ కార్మికుల సమ్మె శిబిరాన్ని బీజేపీ నాయకుడు ఏగోలపు సదయ్యగౌడ్ సందర్శించి సంఘీభావం తెలిపారు. కార్మికులందరితో సహపంక్తి భోజనం చేశారు. కార్మికులు పాల్గొన్నారు.

**మూతికి బట్ట కట్టుకుని నిరసన**

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలో మూతికి బట్ట కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. కార్మికుల సంఘం ప్రధాన కార్యదర్శి ఖాజా, నాయకులు పాల్గొన్నారు.

**దున్నపోతుకు వినతి**

ఎలిగేడు: మండల కేంద్రంలో పారిశుద్ధ్య కార్మికులు దున్నపోతుకు వినతిపత్రం అందించి నిరసన వ్యక్తం చేశారు. జీపీ ఉద్యోగ, కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఇరుగురాల లచ్చయ్య, కార్యదర్శి ఎండీ.ఖాజ, కవ్వంపల్లి దేవయ్య, మండల అధ్యక్షుడు తీట్ల శ్రీనివాస్, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

జూలపల్లి: గ్రామాల నుంచి వచ్చిన పంచాయతీ కార్మికులు, ఉద్యోగులు స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట వేసిన దీక్షా శిబిరంలో పాల్గొని నిరసన తెలిపారు. కార్మిక సంఘం మండల అధ్యక్షుడు సంపత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు పరిహారం అందించాలి

కాల్వశ్రీరాంపూర్: ఎడతెరిపి లేని వర్షాలకు ఇళ్లు కోల్పోయిన బాధితులకు, పంటపొలాల్లో ఇసుకమేటలు పెట్టి నష్టపోయిన రైతులకు, వరద తాకిడికి కోతకు గురైన పొలాలకు పరిహారం అందించాలని మీర్జంపేట ఎంపీటీసీ గూడెపు జనార్దన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకుడు తాత రవియాదవ్, మండల అధ్యక్షుడు చిలువేరు సంపత్ డిమాండ్ చేశారు. గ్రామాల్లో వందలాది ఎకరాలు వరదలతో నష్టపోయారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరాకు కనీసం రూ.30వేల పరిహారం అందించాలని కోరారు.

## వరదకు కొట్టుకుపోయిన రోడ్డు



రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు

సుల్తానాబాద్‌రూరల్: వరుస వర్షాలకు మండలంలోని నీరుకుల్లలోని రంగనాయకస్వామి ఆలయానికి వెళ్లేరోడ్డు వరదనీటికి కొట్టుకుపోయింది. శుక్రవారం తహసీల్దార్ యాకన్న, ఎంపీడీఓ శశికళ, సర్పంచ్ విజేందర్ పరిశీలించారు.